క్లుప్తంగా

మంత్రి కొట్టు సత్యనారాయణకు పంచాంగం అందజేత



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలో కలిసి పంచాంగం పుస్తకాన్ని అందజేశారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు, ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ ఆలయ ప్రధాన అర్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో మంత్రిని కలిసి శాలువా కప్పి, పంచాంగం పుస్తకంతో పాటు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు.

ముస్లింలకు మంత్రి జోగి రమేష్ శుభాకాంక్షలు

పెడన: పవిత్ర రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా ఉపవాస దీక్షాపరులకు, ముస్లింలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజులు పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించే రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. దివ్య ఖురాన్ ఆవిర్భవించింది రంజాన్ మాసంలోనే కావడంతో ముస్లింలు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తారని చెప్పారు. ఉపవాస దీక్షలు చేసే ప్రతి ఒక్కరికి అల్లా ఆశీస్సులు ఉండాలని, అందరికీ మంచి జరగాలని మంత్రి ఆకాంక్షించారు.

నందమూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

పెడన: వారంలో ఒక రోజు మీ వద్దకు వచ్చి వైద్య సేవలు అందిస్తామని పెడన పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మీనాదేవి అన్నారు. నందమూరు గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 45 మందికి ఓపీ చూసి మందులను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పరీక్షించి వారి బరువును తూచి పలు సూచనలు చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో ఈఎంఆర్ కుమారి, ఎంపీహెచ్ఈఓ ఎం. వీరయ్య, హెచ్ఎస్ జి. శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణంలో అప్రమత్తత తప్పనిసరి

కృత్తివెన్ను: ప్రయాణంలో అప్రమత్తత తప్పనిసరి అని కృత్తివెన్ను ఎస్ఐ గణేష్‌కుమార్ అన్నారు. గతంలో మాదిరి కాకుండా ఈ ప్రాంతంలో కొత్తగా జాతీయ రహదారి ఏర్పాటైందని, దీనికి స్థానిక ప్రజలు పూర్తిగా అలవాటు పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. మండల పరిధిలోని గాంధీనగర్‌లో 216 జాతీయ రహదారిపై ట్రాఫిక్ కంట్రోలర్లకు రేడియం స్టిక్కర్ల ఏర్పాటును గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం వాహనదారులు, స్థానికులకు ప్రయాణ భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు తాము ప్రయాణించే వాహన వేగాన్ని నియంత్రించుకోవాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్, కారులోని వారు సీట్ బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. స్థానికులు రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ వాహనాల రాకపోకలను గమనించి రోడ్డును క్రాస్ చేయాలని సూచించారు.

కార్నియాల సేకరణ



చుండూరు ప్రసాద్ (ఫైల్)

నాగాయలంక(అవనిగడ్డ): స్థానిక ఆరో వార్డుకు చెందిన వంట మేస్త్రి చుండూరు ప్రసాద్ (73) గురువారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ నేత్రదానంపై అవగాహన కల్పించారు. ప్రసాద్ కుటుంబ సభ్యుల అంగీకారంతో విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్య సిబ్బంది కార్నియాలు సేకరించి తరలించారు. నేత్రదానానికి సహకరించిన చుండూరు నరసింహారావు, చందోలు సత్యవతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉయ్యూరులో మినీ జాబ్‌మేళా

పామర్రు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి, ఎస్ఈఈడీఏపీ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉయ్యూరు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పామర్రులో ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు బస్ డిపో సమీపంలోని శ్రీలంక కాలనీలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) ట్రైనింగ్ సెంటరులో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మేళాలో శ్రీ సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గల వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యోగ యువకులు అర్హులని, పూర్తి వివరాలకు 79813 68429 నంబరును సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యమస్తు

- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో గడప వద్దకే వైద్య సేవలు
- పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యుల నియామకం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణకు సీసీ కెమేరాల ఏర్పాటు



పెడన పీహెచ్‌సీ ఓపీ విభాగం వద్ద రోగులు

పెడన: నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు చేరువ చేసేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు (హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు) ఏర్పాటు చేసి నూతన భవనాలను నిర్మించి వైద్య సిబ్బందిని నియమించి వైద్యసేవలు అందిస్తోంది. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులను నియమించింది. ఒక వైద్యుడు లేదా వైద్యురాలు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రతి గ్రామానికి వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నారు. మరో వైద్యుడు పీహెచ్‌సీలో ఉంటూ వైద్యం అందిస్తున్నారు. ఇద్దరు వైద్యులు కూడా వారంలో మూడు రోజులు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు, మరో మూడు రోజులు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించాల్సి ఉంటోంది. పీహెచ్‌సీలలో అందించే వైద్య సేవలపై నిఘా ఉంచారు. వైద్యుల పరంగా సేవలు బాగానే ఉంటున్నా క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా విధులు సక్రమంగా నిర్వహిస్తున్నదీ, లేనిది పరిశీలించేందుకు, వైద్యులు, సిబ్బంది పీహెచ్‌సీలకు నిర్ణీత సమయానికి హాజరవుతున్నదీ, లేనిది నేరుగా పరిశీలించేందుకు సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో కాకుండా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

పీహెచ్‌సీలలో పెరిగిన ఓపీ

ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవుట్ పేషెంట్ సేవలు పెరిగాయి. గతంలో కంటే మెరుగ్గా సేవలను అందిస్తుండటంతో పాటు అన్ని రకాల మందులు కూడా ఇస్తున్నారు. పెడన పీహెచ్‌సీకి గతంలో ఓపీకి రోజుకు 40 నుంచి 50 మంది మాత్రమే వచ్చేవారు. ప్రస్తుతం ఈ సంఖ్య వందకు మించిందని వైద్యాధికారులు చెబుతున్నారు.

> **మెరుగైన సేవలు అందిస్తున్నాం**
>
> 
>
> పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. మందులు అందుబాటులో ఉన్నాయి. ఓపీకి వచ్చే రోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఇటీవలే పీహెచ్‌సీలో నాలుగు సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారని చెబుతున్నారు. గతంలో కంటే ఓపీ బాగా పెరిగి ఈ సంఖ్యకు వందకు పైగా వెళ్లింది.
>
> – పర్వేజ్ హైదర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెడన

సీసీ కెమేరాల ఏర్పాటు..

పెడన నియోజకవర్గంలోని ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. పెడన మండలంలోని పెడన, చేవేంద్ర, గూడూరు మండలంలోని మల్లవోలు, బంటుమిల్లి మండలంలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి, కృత్తివెన్ను మండలంలోని చినపాండ్రాక, కృత్తివెన్ను, లక్ష్మీపురం పీహెచ్‌సీలలో ఒక్కో పీహెచ్‌సీలో నాలుగు చొప్పున సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఆయా పీహెచ్‌సీలలో మందులు ఇచ్చు గది, ఓపీ విభాగం, డాక్టర్ గది బయట (కారిడార్ కవర్ అయ్యేలా), లేబర్ రూం సమీపంలో వీటిని ఏర్పాటు చేశారు.

వాతావరణంలో మార్పులు.. రైతుల భయాందోళన

పొలంబాట పట్టిన రైతులు



కొర్లపాడు గ్రామంలో కోత మిషన్‌తో మినుము పైరు నూర్పిడి చేస్తున్న రైతులు

బంటుమిల్లి: వాతావరణ మార్పులు, కమ్ముకున్న కారుమబ్బులతో రైతులు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలో రెండో పంటగా మినుము, వేరుశనగ సాగు చేసిన రైతులతోపాటు సార్వా పంటలో కుప్పలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాస్త్రవేత్తలు మరో రెండు రోజులు వర్షాలు పడతాయని హెచ్చరిస్తున్నారు. వారం రోజులుగా చెదురుమదురు వర్షాలతో పలు గ్రామాల్లో కుప్పలు తీసిన ధాన్యం, మినుములు, వేరుశనగ తడిసిపోయాయి. మధ్యలో ఎండలు రావడంతో భయంలేదని వ్యవసాయశాఖాధికారులు తెలిపారు. కానీ వర్షానికి పలు గ్రామాల్లో మినుము పంట నేలపాలైందని రైతులు విచారం వ్యక్తం చేశారు. వేరుశనగ పైరు లాగి ఎండబెట్టిన క్రమంలో వర్షం పాలైంది. ఈ స్థితిలో మరలా గురువారం ఆకాశం మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకోవడంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఎండలు రావడంతో రైతులు కుప్పలు తీశారు. అలాగే వేరుశనగ, మినుము లాగి ఆరపెట్టారు. ఇప్పటికే ఆరబెట్టిన రైతులు కోత మిషన్ల ద్వారా పంటను ఇంటికి తరలించేందుకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. కంచడం, బర్రిపాడు, కొర్లపాడు గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో వరి కుప్పలు, 100 ఎకరాల్లో వేరుశనగ, 100 ఎకరాల్లో మినుము పైరు ఉందని ఏఓ శివరామకృష్ణ తెలిపారు. రెండు రోజులు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వీడని వర్షాలు

కొత్తమాజేరు(చల్లపల్లి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కొనసాగుతున్నాయి. గత గురువారం రాత్రి మొదలైన వర్షాలు కొద్దిగా తెరపిచ్చినప్పటికీ మళ్లీ ప్రభావం చూపుతున్నాయి. గురువారం మధ్యాహ్నం మండల పరిధిలోని కొత్తమాజేరు గ్రామంలో కుండపోతగా వర్షం కురిసింది. ఎడతెరపి లేని వర్షంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

రోగుల పట్ల వైద్యసిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం



లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కోడూరు: రోగుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరిశె మాధవరావు, వార్డు సభ్యుడు వెన్నా ప్రసాద్, తోట గోపి, వైఎస్సార్ సీపీ నేతలు పీహెచ్‌సీని పరిశీలించారు. కోడూరుకు చెందిన ఒక వార్డు సభ్యుడు బుధవారం కుక్క కాటుకు గురై ఆస్పత్రికి వస్తే సిబ్బంది ర్యాబిస్ వ్యాక్సిన్ వేయకుండా దురుసుగా వ్యవహరించారని జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్క కాటుకు గురైన నలుగురు వ్యక్తులు ఒకేసారి వస్తే గాని వ్యాక్సిన్ బాటిల్ తీయడానికి లేదని, వ్యాక్సిన్ వేయలేమని వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధి వస్తేనే సిబ్బంది ఈ విధంగా వ్యవహరించారంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు వైద్యాధికారి మౌనికకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి ప్రజాప్రతినిధులకు హామి ఇచ్చారు.

మత్స్య ఉత్పత్తుల తయారీపై శిక్షణ

కోడూరు: విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తుల తయారీపై మత్స్యకార మహిళలకు గురువారం ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు.. మండలంలోని పాలకాయతిప్ప గ్రామంలో ఎన్‌డీపీ–జీసీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. మహిళలు మత్స్య సంపదలో అనేక రకాల వంటకాలు తయారు చేయడంతో పాటు వాటిని మార్కెట్‌లో ఏవిధంగా విక్రయించాలనే అంశాలపై భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. మత్స్య సంపదను ఎండబెట్టే విధానంతో పాటు ప్యాకింగ్ చేసే పద్ధతులను వివరించారు. ముందుగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. మరో రెండు రోజులు శిక్షణా తరగతులు కొనసాగుతాయని ఎఫ్‌డీఓ వి.సత్యనారాయణ తెలిపారు. సర్పంచి కొక్కిలిగడ్డ భిక్షాలు, వీఎఫ్ఏలు పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: నాణ్యమైన రుచికరమైన మత్స్య ఉత్పత్తులను మనమే సొంతంగా తయారు చేసుకుందామని ఫిషరీస్ ఏడీ నాగబాబు అన్నారు. కృత్తివెన్ను మత్స్య అభివృద్ధి కార్యాలయంలో విలువ ఆధారిత మత్స్య ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫిష్ బర్గర్స్, ఫిష్ కట్‌లెట్, ఫిష్‌బాల్స్, ఫిష్ సీజ్‌బాల్స్ తదితర వంటకాలపై మహిళలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎంపీపీ గరుడ ప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఎఫ్‌డీఓ డి. అంజనీ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

బంటుమిల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతిని సీపీఎం నాయకులు గురువారం నిర్వహించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ పోరాటాలను వివరించారు. సీపీఎం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు ఎం. శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, ఎల్. అజయ్‌ఘోష్, రవి, శ్రీనివాసరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్(ఐసీఈయూ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎల్ఐసీ మచిలీపట్నం డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విప్లవ వీరుడు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఉద్యోగులు కార్యాలయం ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శనతో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. బ్రిటీష్ పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించి అతి చిన్న వయస్సులోనే ఆయన ఉరికంభం ఎక్కాడని, ఆయన దేశభక్తి శ్లాఘనీయమని ఐసీఈయూ సంఘ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి. సుధాకర్, ఎల్. రాజశేఖర్, ఠాగూర్, రత్నారావు, శ్రీనివాసరావు, మాధుర్, స్వామినాథ్ తదితరులు పాల్గొన్నారు.

- నేతాజీ మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక విజయవాడ రోడ్డులో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘ ప్రతినిధులు ధూళిపాల శ్రీరామచంద్రమూర్తి, మైనంపూడి సాయిబాబు, సుబ్బారావు, బ్రహ్మయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

డీఎంహెచ్ఓ గీతాబాయి

పెడన: మెరుగైన వైద్య సేవలతో ప్రజల్లో గుర్తింపు తీసుకురావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. గురువారం ఉదయం డీఎంహెచ్ఓ పెడన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్‌హైదర్ మాట్లాడుతూ ఓపీ గతం కంటే మెరుగ్గా ఉందని, రోగులు బాగా వస్తున్నారని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు ఎవరు హాజరైంది తదితర విషయాలపై ఆరా తీసిన ఆమె రక్త పరీక్షా గదిని, మందులు ఇచ్చు గదిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ పరంగా అంతా బాగానే ఉందన్నారు. రోగులను ఆత్మీయంగా పలుకరించి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఉరుసుకు పోటెత్తిన ముస్లింలు



ప్రత్యేక ప్రార్థనల్లో కడవకొల్లు నరసింహారావు



ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు, భక్తులు

కోడూరు: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పెదగుడుమోటులో బెంగాలీషా బాబావలి ఉరుసు మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఉరుసు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట, నిజాంపట్నం, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలకు చెందిన ముస్లింలు ప్రత్యేక వాహనాల్లో ఉరుసుకు తరలివచ్చారు. బాబావారి సమాధిపై పచ్చరంగు వస్త్రాన్ని కప్పి గంధాన్ని చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబావారి సమాధితో పాటు దర్గా ప్రాంగణంలో ఉన్న పలువురు మతపెద్దల సమాధుల వద్ద కూడా ప్రార్థనలు జరిగాయి. గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, డీజే పాటల మధ్య జెండాలను ఊరేగించారు. దర్గా వద్ద ఆటగుర్రం విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఆటగుర్రం పాటలకు అనుగుణంగా నృత్యం చేస్తూ సందడి చేసింది. అనంతరం గుర్రంపై మందపాకల, చినగుడుమోటు గ్రామాల్లో చందనోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గురువారం ఉదయం దర్గా వద్ద దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. బాబా వారి సమాధి చుట్టూ దీపాలు వెలిగించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, కోడూరు, అవనిగడ్డ జెడ్పీటీసీలు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వయోలిన్ విద్వాంసుడు రామస్వామికి సన్మానం



రామస్వామిని సత్కరిస్తున్న త్యాగరాజ సంగీత విద్యాపీఠం ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: తన జీవితాన్ని సంగీత సేవకే వెచ్చించిన వయోలిన్ విద్వాంసుడు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి ఎంతోమంది వయోలిన్ కళాకారులకు మార్గదర్శకంగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. త్యాగరాజ సంగీత విద్యాపీఠం మచిలీపట్నం శాఖ స్వర్ణోత్సవ సంగీత సభలో భాగంగా రెండో రోజైన గురువారం అన్నవరపు రామస్వామిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

స్థానిక బుట్టాయిపేటలోని చిట్టి పిళ్లారయ్య స్వామి దేవస్థానం ఆవరణలో స్వర్ణోత్సవ వేడుకల సభలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రామస్వామి ప్రపంచ వ్యాప్తంగా వేలాది ప్రదర్శనలు ఇచ్చారని చెప్పారు. గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గురుకులంలో శిక్షణ పొందిన ఆయనకు నాదసుధార్ణవ బిరుదును మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఇచ్చి సత్కరించారని గుర్తు చేశారు. భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కారుమూరి రాజేంద్రప్రసాద్, ముదిగొండ శాస్త్రిలు రామస్వామిని ఘనంగా సత్కరించారు.

అలరించిన సుధాకర్ గాత్ర కచేరీ

అనంతరం మోదుమూడి సుధాకర్ ఆలపించిన గాత్ర కచేరీ సభికులను మంత్ర ముగ్ధులను చేసింది. పాలపర్తి నాగేశ్వరరావు వయోలిన్‌పై, సద్గురు చరణ్ మృదంగంపై, ఎం. హరిబాబు ఘటంపై వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని త్యాగరాజ సంగీత విద్యాపీఠం నిర్వాహకులు పర్యవేక్షించారు.

పుచ్చగడ్డలో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు



లక్ష్మీపురం(చల్లపల్లి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. స్థానిక వైద్య ఆరోగ్య శాఖ ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. నీరసంతో బాధపడుతున్న ఇద్దరికి సెలైన్ పెట్టి చికిత్స చేశారు. పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో మూడు విడతలుగా ఎబెట్ పిచికారీ చేయించి, బ్లీచింగ్ చల్లించారు. లార్వా నిర్మూలన చర్యలు చేపట్టారు. గ్రామంలోని గొర్రెల కాపరులు, పశుపోషకులు నిల్వ ఉంచిన వ్యర్థాల గుట్టలు స్వచ్ఛందంగా తొలగించి పరిశుభ్ర వాతావరణం ఏర్పాటు చేయాలని అధికారుల సూచనల మేరకు గ్రామస్తులు స్వచ్ఛందంగా తొలగింపు పనులు చేపట్టారు. మండల వైద్యాధికారులు డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ కె.విజయరావు, లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ ఆకుల సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకరరావు, ఏఎన్ఎంలు పర్యవేక్షించారు.

• ఆకట్టుకున్న ప్రదర్శన



మండల పరిధిలోని కోసూరువారిపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. 23.3.23 తేదీ అరుదుగా వస్తుంది. విద్యార్థులు పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహం వద్ద ఈ తేదీ రూపంలో గురువారం కూర్చుని ఆకట్టుకున్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం పీవీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

– కోసూరువారిపాలెం(మోపిదేవి)

కరకట్ట ర్యాంపు అభివృద్ధి పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు నుంచి పాములలంక వెళ్లే కరకట్ట ర్యాంపు అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కరకట్ట ర్యాంపు అధ్వానంగా మారటంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. కరకట్ట ర్యాంపు, సొసైటీలో డొంక రహదారి అభివృద్ధి పనులను మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టినట్లు వెంకటేశ్వరరావు తెలియజేశారు. సర్పంచ్ శీలం రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సోలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



ముదినేపల్లిరూరల్: విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. స్టాకు రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పోషకాహారాన్ని మధ్యాహ్న భోజనం ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. మండల పరిషత్ ఏఓ రమణరావు జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

26న వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

ముదినేపల్లి రూరల్ : వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తహసీల్దార్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న స్థానిక జెడ్పీ హైస్కూల్లో వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. వారోత్సవాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో వెలుగు ఏపీఎం బి.సత్యనారాయణ, పలువురు సీసీలు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం పాట ఖరారు

ముదినేపల్లిరూరల్: మండలంలోని చేవూరు శ్రీలక్ష్మీనారసింహ ఆలయ చేపల చెరువుకు వేలంపాటలు గురువారం నిర్వహించారు. ఆలయానికి గ్రామంలో ఉన్న 1.95 ఎకరాల చేపల చెరువు మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు ఎండోమెంట్స్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా, ఏడాదికి రూ.1,01,400కి పాట పాడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వల్లభనేని సంపూర్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.